క్లుప్తంగా

ఆర్మూర్ -డొంకేశ్వర్ బస్సు ప్రారంభం



డొంకేశ్వర్(ఆర్మూర్): కొత్తగా ఏర్పడిన డొంకేశ్వర్ మండలానికి ఆర్మూర్ డిపో నుంచి ఆర్టీసీ బస్సు సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, ప్రజల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ అధికారులు బస్సును ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్మూర్ నుంచి వన్నెల్(కె) మారంపల్లి, నూత్‌పల్లి గ్రామాల మీదుగా రెండు ట్రిప్పులు బస్సు నడవనుంది. తొలిసారిగా బస్సు డొంకేశ్వర్‌కు రావడంతో సర్పంచ్ చాయచందు, గ్రామస్తులు స్వాగతం పలికారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు



ఆర్మూర్‌టౌన్: క్రీడలు ఆడటం వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ప్రముఖ వైద్యుడు రాకేష్ అన్నారు. పట్టణంలోని బాలుర పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం మినీ సబ్ జూనియర్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ బాల, బాలికల శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని, మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం తమకు నచ్చిన క్రీడల్లో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. టీటీయూ జిల్లా అధ్యక్షుడు పెంట జలంధర్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగా మోహన్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు



వర్ని: మండల కేంద్రంలో మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ మంగాదేవి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి, కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబురాలు నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, చందూర్ మండల కన్వీనర్ సాయి రెడ్డి, లతా జోష్ణ పాల్గొన్నారు.

వరి పంట ముందస్తుగా సాగు చేయాలి



కమ్మర్‌పల్లి: ఈ సీజన్‌లో రైతులు వరి పంటను ముందస్తుగా సాగు చేయాలని భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య సూచించారు. మండలంలోని ఉప్లూర్ రైతు వేదిక భవనంలో మంగళవారం ఆయన పంటలసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వరి ముందస్తు సాగులో భాగంగా ఈ రోహిణి కార్తెలోనే వరినార్లు పోసుకోవాలని సూచించారు. భూసారం పెరగడానికి పచ్చిరొట్ట సాగు చేసుకోవాలన్నారు. దీనివల్ల 25శాతం రసాయనిక ఎరువులు తగ్గించుకోవచ్చన్నారు. సోయాబీన్ పంటలో విత్తన మొలక శాతాన్ని పెంచే విధానం, మెళకువలను తెలియజేశారు. పీఏసీఎస్ చైర్మన్ రేగుంట దేవేందర్, ఏఈఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ప్రత్యేక శిక్షణ



ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ అభియాన్ పర్యవేక్షకుడు నరేష్‌గౌడ్ అంగన్‌వాడీ సిబ్బందికి ఆన్‌లైన్‌పై ప్రత్యేక శిక్షణ కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పోషణ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జస్వీఎస్ నమోదు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందన్నారు. టీచర్లు క్రమం తప్పకుండా ఆన్‌లైన్ విధానంలో సూచించిన అంశాలను పొందుపరచాల్సి ఉంటుందని, తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌చార్జి పర్యవేక్షకురాలు శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

నవీపేట: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకులు మోహన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డిలు కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలపై మారుమూల గ్రామాలలో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. మండల నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేసేదెప్పుడు?

- నూత్‌పల్లి బీసీ గురుకులంలో సమస్యల తిష్ట
- ఊడిపోతున్న కిటికీలు, బాత్‌రూం డోర్లు
- పట్టించుకోని అధికారులు



నూత్‌పల్లిలోని జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాల

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నూత్‌పల్లి లోగల (కుద్వాన్‌పూర్) మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. మరో పదిరోజుల్లో తరగతులు ప్రారంభం కానుండగా.. సంబంధిత శాఖ అధికారులు ఇంత వరకు మరమ్మతులు జరపలేదు. కిటికీల తలుపులు ఊడిపోయి కనిపిస్తున్నాయి. బాత్‌రూం, టాయిలెట్ల డోర్లు పూర్తిగా చెడిపోయాయి. దీంతో త్వరలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. వేసవి సెలవుల్లోనే పాఠశాలలో మరమ్మతులు చేయించాల్సి ఉంది. కానీ, నిధుల సమస్యతో ఇంత వరకు చేపట్టలేదు. వాస్తవానికి ఈ పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో స్థానికంగా అందుబాటులో ఉన్న ఎస్సీ హాస్టల్ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు.

త్వరలో ప్రారంభం కానున్న తరగతులు..

మరో పన్నెండు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో వేసవి సెలవులు పూర్తికాగానే విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. కానీ ఈ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోవడంతో విద్యార్థులు మళ్లీ ఇబ్బందులు పడనున్నారు. ఈ బడిలో ఐదు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు సుమారూ 450 మంది వరకు ఉండగా, ఇక్కడే వసతి కూడా పొందుతున్నారు. గదులు సరిపడా లేక ఇబ్బందులు పడుతున్నారు. కిటికీల తలుపులు ఊడిపోవడంతో గతేడాది నుంచి అట్టముక్కలు అడ్డుగా పెడుతున్నారు. అలాగే బాత్‌రూం తలుపులు విరిగిపోయాయి. విద్యార్థులు స్నానాలు చేయాలంటే డోర్లకు అడ్డంగా రాళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. వీటి స్థానంలో కొత్తవి బిగించాల్సిన అవసరం ఉంది. డ్రెయినేజీ, ఎలక్ట్రిసిటీ, తాగునీటి సమస్యలు కూడా నెలకొన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గురుకులంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం..

పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి, అవసరమైన పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతాం. ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పాఠశాల ప్రారంభమైన వెంటనే మరమ్మతులు జరిగేలా చూస్తాం.

–సంతోష్, ప్రిన్సిపాల్, బీసీ గురుకులం, నూత్‌పల్లి



రాళ్లు అడ్డు పెడితేగాని ఆగని బాత్‌రూం డోర్లు



విరిగిన బాత్‌రూం డోరు





ధ్వంసమైన కిటికీలు



వేలాడుతున్న ట్యూబ్‌లైట్

లింగాయత్‌లను విడదీసే కుట్రను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న వీఆర్ దేశాయ్, దిగంబర్‌రావు

బోధన్: వీరశైవ లింగాయత్ సామాజిక వర్గాన్ని రెండుగా విడదీసేందుకు కొందరు చేస్తున్న రాజకీయ కుట్రలను వ్యతిరేకించాలని వీరశైవ లింగాయత్ సమాజ్ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు వీఆర్ దేశాయ్, కందారే దిగంబర్‌రావులు అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు కర్ణాటక రాష్ట్ర ప్రాంత నాయకులు తెలంగాణలోకి వచ్చి ఐక్యంగా ఉన్న వీరశైవ లింగాయత్‌ల్లో వీరశైవులు, లింగాయత్‌లు వేర్వేరు అంటూ గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. ఈనేపథ్యంలోనే జూన్ 4న హైదరాబాద్‌లో లింగాయత్‌ల పేరిట తలపెట్టిన ర్యాలీకి ఎవరూ వెళ్లకూడదని, ఈ ర్యాలీ వల్ల సమాజ్ ఐక్యత, భవిష్యత్తుకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. నిర్వాహకులు లింగాయత్‌లకు మైనార్టీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారని, దీనివల్ల సాధించుకున్న బీసీ రిజర్వేషన్, ఓబీసీ జాబితాలో చేర్చే నిర్ణయానికి దూరం కావాల్సి వస్తోందని, సమాజ్‌సభ్యులు విభజన రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



బోధన్‌లో విశ్వబ్రాహ్మణ విద్యార్థులను అభినందిస్తున్న ఏసీపీ కిరణ్ కుమార్

బోధన్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదవాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు. పట్టణంలోని విశ్వకర్మ భవనంలో మంగళవారం ఎస్సెస్సీలో అత్యధిక మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ ప్రతిభ పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో పురస్కారాలు ప్రదానం చేయడంపై అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల కృష్ణ, డివిజన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మహిళలకు ఆరోగ్య పరీక్షలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అయేషా 122మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 14మందికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

కాకతీయలో ప్రాంగణ నియామకాలు



మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ వద్ద గల కాకతీయ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం టాస్క్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు జరిపారు. మొత్తం 250మంది విద్యార్థినులు పాల్గొనగా కాకతీయ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 19మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులను వైస్ ప్రిన్సిపాల్ సాయిరెడ్డి అభినందించారు.

అగ్నివీర్ నేవీకి ఎంపిక



రుద్రూర్: అగ్నివీర్ (నౌకదళం) ఉద్యోగానికి కోటగిరి మండలం ఎత్తోండ గ్రామానికి చెందిన తాళ్ల కృష్ణ, నాగరాణి దంపతుల కూతురు తాళ్ల భూమిక ఎంపికైంది. ఈసందర్భంగా మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు భూమికను అభినందించారు. రూ. 5వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మాజీ ఎంపీపీ పుప్పాల శంకర్, కొట్టం మనోహర్, షాహీద్, ఖాదర్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ వద్ద మంగళవారం పీవైఎల్ నాయకులు రాష్ట్ర రెండవ మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జూన్ 6, 7 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో రాష్ట్ర రెండవ మహాసభలు జరుగుతాయని మండల నాయకుడు శివకుమార్ వెల్లడించారు. దుర్గాప్రసాద్, రాం మోహన్‌లు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



భీమ్‌గల్: మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన లక్ష్మీకి వైద్య చికిత్స నిమిత్తం రూ.2లక్షల ఎల్‌ఓసీని మంగళవారం లక్ష్మి భర్త ముత్తెన్నకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ముత్తెన్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌కు చెందిన అల్లకొండ లహరికి మంగళవారం రూ.25వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును సర్పంచ్ అశోక్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోడ దేవేందర్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

భీమ్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరు కలిసి విజయవంతం చేయాలని ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి పేర్కొన్నారు. మండలకేంద్రలో మంగళవారం ఉత్సవాల నిర్వహణపై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే నెల 2నుంచి 21వరకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో రాజేశ్వర్, తాహసిల్దార్ శ్రీదర్, ఆర్‌అండ్‌బీ ఏఈ రాజేశ్వర్, ఎంపీవో గంగ మోహన్ ఏపీవో నర్సయ్య, ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లపై పోలీసుల దాడి సరికాదు



బోధన్: దేశ రాజధాని ఢిల్లీలో మహిళా మహిళా రెజ్లర్లపై పోలీసుల దాడి సరికాదని ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు నాగమణి అన్నారు. ఈమేరకు పట్టణంలో మంగళవారం ఆమె సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాగమణి మాట్లాడుతూ.. తమకు న్యాయం చేయాలని రెజ్లర్లు నిరసన దీక్షలు చేస్తున్నా, కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం బాధకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. సంఘ సభ్యులు బీపాషా, పార్వతి, పోసాని, గంగామణి, లక్ష్మి, సునంద, సావిత్రి, నర్సవ్వలు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలాని తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్ సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీ నాయకులు, బూత్ స్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. నూతనంగా ఓటు హక్కు నమోదు కోసం ఫారం 6, తొలగింపు కోసం ఫారం 7, సవరణ కోసం ఫారం 8లను పూర్తి చేసి బూత్ స్థాయి అధికారి లేదా ఆన్‌లైన్‌లో అక్టోబరు ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆలూర్ తహసీల్దార్ దత్తాద్రి, డిప్యూటీ తహసీల్దార్ విజయకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే టీజీయూజీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థినులు సంబంధింత వివరాలతో కళాశాలకు రావాలని సూచించారు. జూన్ 1న న బీఏ, హెచ్‌ఈపీ, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, 2న బీసీలైఫ్‌సైన్స్, బీజెడ్సీ, 3న బీకాం కంప్యూటర్, బీకాం జనరల్ విద్యార్థులు రావాలని పేర్కొన్నారు. విద్యార్థులు పదోతరగతి మెమో, ఇంటర్ హాల్‌టికెట్, మెమో, టీజీయూజీసెట్ హాల్‌టికెట్, ర్యాంక్‌కార్డు, కులం , ఆదాయం, బోనఫైడ్, ఆధార్‌కార్డు, 5 ఫోటోలతో హాజరుకావాలన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని తొండాకూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.56,200 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ వెల్లడించారు.

వీవోఏల సమ్మె విరమణ





ఆర్మూర్‌లో ఏపీఎం గంగారాంకు సమ్మె విరమణ పత్రం అందజేస్తున్న వీవోఏలు.. వేల్పూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో గత 36 రోజులుగా వీవోఏలు నిర్వహించిన సమ్మె మంగళవారం విరమించారు. దీంతో పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం గంగారాంకు సమ్మె విరమణ పత్రంను వీవోఏలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు, ఆర్థిక, వైద్యశాఖ మంత్రి హరీష్‌రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డిలు వీవోఏల సమస్యలపై సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చారన్నారు. అలాగే జిల్లా సెర్ప్ జేఏసీ నాయకులు మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు. దీంతో సమ్మెను తాత్కాలికంగా విరమించుకున్నట్లు వీవోఏలు పేర్కొన్నారు. వీవోఏలు, నర్సాగౌడ్, సువర్ణ, రేఖ,నారాయణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలంలో నెలరోజులకు పైగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలు మంగళవారం విరమించారు. ఈమేరకు వారు విధుల్లో చేరారు. తమ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రుల హామీతో సమ్మె విరమిస్తున్నట్లు వారు వెల్లడించారు.

రుద్రూర్: మండలకేంద్రంలో 36రోజులుగా నిరవధిక సమ్మె చేసిన ఐకేపీ వీవోఏలు మంగళవారం సమ్మె విరమించి విధులకు హాజరవుతున్నట్టు ఐకేపీ ఏపీఎం భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. సమ్మె కాలంలో మద్దతు తెలిపిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు, వివిద పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు అందించాలి



రెంజల్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

రెంజల్(బోధన్): అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ నియోజకవర్గ నాయకుడు వడ్డి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూంల పేరుతో అక్రమంగా ఇసుకను తరలిస్తు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూంలు ఏఏ గ్రామాల్లో అందించారో ఎమ్మెల్యే వివరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాంచందర్‌కు వినతిపత్రం అందించారు. జెడ్పీటీసీ మేక విజయ, మండల అధ్యక్షుడు చుక్క రాజుగౌడ్, మాజీ ఎంపీటీసీ కిషోర్, నాయకులు యోగేశ్, పోశెట్టి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చండి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- ఎమ్మెల్యే షకీల్ దిష్టిబొమ్మ దహనం



ఎమ్మెల్యే షకీల్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే షకీల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడు ఎకరాల సాగు భూమి, ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, ప్రజల మభ్యపెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. నెల రోజులక్రితం తడిసిన వరి ధాన్యాన్ని నేనే కొంటానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే షకీల్ అప్పటి నుంచి కనిపించకుండా పోయారని విమర్శించారు. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నవీన్, హరికాంత్‌చారి, పోశెట్టి, చిరంజీవి, ప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మీ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా జరుగుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెండోరోజు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు ఉదయం స్థాపిత దేవతల మండపారాధన, బింజ శుద్ధి, ధాన్యధివాసం తదితర పూజలు నిర్వహించారు.



మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

సివిల్స్ ర్యాంకర్ మహేష్‌కు అభినందన



బోధన్: ఇటీవల విడుదలైన సివిల్స్ -2022 తుది పరీక్ష ఫలితాల్లో ఆలిండియా 200 ర్యాంక్ సాధించిన బోధన్‌కు చెందిన కమతం మహేష్‌కుమార్‌ను మంగళవారం మాల మహానాడు జిల్లా, పట్టణ ప్రతినిధులు ఘనంగా సన్మానించి అభినందించారు. నాయకులు ఆనంపల్లి ఎల్లయ్య, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 – ఫాస్ట్ ఎక్స్ (తెలుగు) 10.30, 4.10, 7.10
గ్రే: ది స్పై హు లవ్డ్ మీ (తెలుగు) 1.30
2018 (తెలుగు) - 10.10 (రాత్రి)

స్క్రీన్-2 – బిచ్చగాడు2 - 12.15, 3.30, 6.45, 10.00

స్క్రీన్-3 – మేమ్ ఫేమస్ - 10.30, 4.30, 10.30
మళ్లీ పెళ్లి - 1.40, 7.40

స్క్రీన్-4 – మెన్‌టూ (తెలుగు) - 12.20, 9.15
2018 (తెలుగు) - 3.05
ది కేరళ స్టోరీ (తెలుగు) - 6.15